నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, మంగళవారం 30 జూలై 2024 | VIKARABAD

ఆకలితోనే..

ప్రభుత్వ బడుల్లో అల్పాహారం పథకం రద్దు..

పస్తులతోనే పాఠాలు వింటున్న విద్యార్థులు

అందని పౌష్టికాహారం

పథకాన్ని తిరిగి ప్రారంభించాలని విద్యార్థుల తల్లిదండ్రుల వినతి

బొంరాస్‌పేట, జూలై 29 : గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేస్తున్నది. ముఖ్యంగా పేదలకు ఉపయోగపడే పథకాలను అమలు చేయడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు అందించే ముఖ్యమంత్రి అల్పాహార పథకానికి కూడా ప్రభుత్వం మంగళం పాడింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునేందుకు వచ్చే విద్యార్థులు ఉదయం ఇంట్లో సమయానికి వంటలు వండక ఉపవాసంతో బడికి వస్తున్నారన్న ఉద్దేశంతో గత ఏడాది బీఆర్ఎస్ ప్రభుత్వం సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించింది. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు పేదరికం కారణంగా సరైన పౌష్టికాహారం తీసుకోరు. అందువల్లే ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంతో పాటు చదువుపై దృష్టి సారించడానికి ఈ పథకం ఎంతో ఉపకరిస్తుందని భావించిన ప్రభుత్వం గత ఏడాది అక్టోబరు 6వ తేదీన ఈ పథకాన్ని ప్రారంభించింది. ప్రతిరోజూ ఉదయం 9.30 గంటలకు 1 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు వారం రోజులపాటు రోజుకో మెనూతో అల్పాహారం అందించేవారు. ఇడ్లీ, సాంబారు, రవ్వ ఉప్మా, చట్నీ, పూరి, ఆలుకుర్మా, టమాటాబాత్, కిచిడీ, ఉగ్గాని, పొంగల్, వెజిటబుల్ పలావ్ వంటి వాటిని వండి విద్యార్థులకు వడ్డించేవారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లే తల్లిదండ్రుల పిల్లలకు ఈ పథకం ఎంతో ఉపయోగపడేది. వికారాబాద్ జిల్లాలోని 1017 ప్రభుత్వ పాఠశాలల్లో చదివే సుమారు 90 వేల మంది విద్యార్థులకు అల్పాహార పథకంతో లబ్ధి కలిగేది. గత ఏడాది నవంబరు నెలాఖరు వరకు ఈ పథకాన్ని కొనసాగించారు. డిసెంబరు నుంచి అల్పాహార పథకం అమలు నిలిచిపోయింది. దీంతో గ్రామీణ ప్రాంతాల నుంచి పాఠశాలలకు వచ్చే విద్యార్థులు ఆకలితో పాఠాలు వింటున్నారు. మధ్యాహ్న భోజన సమయం వరకు విద్యార్థులు ఖాళీ కడుపుతో పస్తులు ఉండాల్సి వస్తున్నది. ఆకలితో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలపై విద్యార్థులు శ్రద్ధ చూపకపోవడంతో వారి చదువులపై ప్రభావం పడుతున్నది. పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగపడే అల్పాహార పథకాన్ని ప్రభుత్వం తిరిగి ప్రారంభించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

పథకం రద్దు సరికాదు

బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సీఎం అల్పాహార పథకాన్ని ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేయడం సరికాదు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులు దూర ప్రాంతాల నుంచి ఉన్నత పాఠశాలలకు వెళ్తుంటారు. ఉదయం వీరికి పాఠశాలల్లో ఇచ్చే అల్పాహారం ఎంతో ఉపయోగపడేది. ఈ పథకాన్ని కొన్ని రోజులే కొనసాగించి రద్దు చేయడంతో విద్యార్థులు ఆకలితో ఇబ్బంది పడుతున్నారు.

-సంగప్ప, బురాన్‌పూర్

అల్పాహారం అందించాలి

అల్పాహార పథకాన్ని తిరిగి ప్రారంభించి విద్యార్థులకు అందించాలి. మారుమూల తండాల నుంచి పేద విద్యార్థులు ఉదయం ఇంటి నుంచి ఒక్కోసారి ఖాళీ కడుపుతోనే పాఠశాలకు వెళ్తుంటారు. మధ్యాహ్న భోజనం పెట్టే సమయం వరకు అలాగే పాఠాలు వింటున్నారు. అల్పాహారం పెడితే విద్యార్థులకు కొంత ఆకలి తీరుతుంది. పాఠాలు శ్రద్ధగా వింటారు. ప్రభుత్వం ఈ పథకాన్ని మళ్లీ ప్రారంభించాలి.

-పరశురాం నాయక్, సంట్రకుంటతండా

రైల్వేలైన్ నిర్మాణంపై సీఎం సమీక్ష

పరిగి, జూలై 29: అసెంబ్లీలోని ముఖ్యమంత్రి చాంబర్‌లో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి వికారాబాద్-పరిగి-కృష్ణా రైల్వే లైన్ నిర్మాణంపై రైల్వే అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిగి, నారాయణపేట ఎమ్మెల్యేలు టి.రామ్మోహన్‌రెడ్డి, చిట్టెం పర్ణికా రెడ్డి, సౌత్ సెంట్రల్ రైల్వే చీఫ్ ఇంజినీర్ సుబ్రహ్మణ్యం, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

షరతులు వర్తిస్తాయి!

నేటి నుంచి రెండో విడత రుణమాఫీ..

నేడు కలెక్టరేట్‌లో లాంఛనంగా ప్రారంభించేందుకు సన్నాహాలు

సోమవారం సాయంత్రం వరకూ జిల్లాకు చేరని జాబితా

ఇప్పుడైనా అర్హులందరికీ మాఫీ అయ్యేనా?.. ప్రభుత్వ కొర్రీలతో రైతుల్లో అనుమానాలు

తొలి విడత జాబితాలో పేర్లు ఉన్నప్పటికీ.. ఇంకా 1,502 మంది రైతుల ఖాతాల్లో జమకాని డబ్బులు

రంగారెడ్డి, జూలై 29(నమస్తే తెలంగాణ) : జిల్లాలో అర్హులైన వేలాదిమంది రైతులకు సంబంధించిన రూ.లక్ష రుణ మాఫీ కాలేదు. రేషన్ కార్డులేని వారిని అనర్హులను చేయడం.. పీఎం కిసాన్ నిబంధనలను కఠినంగా అమలు చేయడం వల్లనే చాలామందికి రుణ మాఫీ కలగలేదు. జాబితాలో పేరున్నప్పటికీ.. ఖాతాల్లో మాఫీ డబ్బులు జమకాని రైతులు ఇంకా జిల్లాలో వేల సంఖ్యలో ఉన్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలోనే ప్రభుత్వం మంగళవారం రూ.1.50 లక్ష రుణాలు తీసుకున్నవారికి మాఫీ చేయనున్నట్లు ప్రకటించింది. ఇందుకు సంబంధించి కలెక్టరేట్‌లో లాంఛనంగా ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. అయితే సోమవారం సాయంత్రం వరకు కూడా రెండో విడత మాఫీకి సంబంధించిన అర్హుల జాబితా జిల్లాకు రాలేదు. దీంతో మంగళవారం నాటి కార్యక్రమానికి ఎవరిని ఆహ్వానించాలనే విషయంలో అధికారవర్గాల్లో సందిగ్ధత నెలకొన్నది. ఇదిలా ఉండగా.. మాఫీ ప్రక్రియ ఆసాంతం అవే షరతులు.. అవే నిబంధనలను అమలు చేస్తుండడంతో రెండో విడత సైతం మొదటి విడత మాదిరిగా గందరగోళానికి దారితీసే అవకాశం ఉందని రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో రుణమాఫీకి అరకొరగానే కేటాయింపులు జరపడంతో రెండు, మూడు విడతల్లో ఏ మేరకు కోత ఉంటుందోనన్న ఆందోళన రైతుల్లో నెలకొన్నది.

మొదటి దఫాలో వేలాది మందికి మొండిచెయ్యి..

రుణమాఫీ భారాన్ని తగ్గించుకునేందుకు ప్రభుత్వం రుణమాఫీలో అనేక కొర్రీలు పెట్టింది. ఫలితంగా మొదటి విడతలో అర్హులైన ఎంతోమంది రైతుల అప్పులు మాఫీ కాలేదనే ఫిర్యాదులు వెల్లువెత్తాయి. రంగారెడ్డి జిల్లాలో 49,741 మంది రైతులకు రూ.278.06 కోట్ల రుణమాఫీని చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. కానీ.. అర్హులైన వారు లక్షకు పైగానే ఉన్నట్లు తెలుస్తున్నది. సహకార సొసైటీల్లో రుణాలు తీసుకున్న చాలామంది రైతులకు రుణమాఫీని వర్తింపజేయలేదు. ఇక.. జాబితాలో పేర్లు వచ్చిన రైతులకు సైతం నేటికీ సాయం అందలేదు. మొదటి రోజున 48,239 మంది రైతులకు సంబంధించి రూ.250కోట్ల మేర రుణమాఫీ డబ్బులు మాత్రమే రైతుల ఖాతాల్లో జమ అయినట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. ఈ లెక్కన ఇంకా.. 1,502 మంది రైతులకు సంబంధించి రూ.28 కోట్లకు పైగా మాఫీ డబ్బులు ఖాతాల్లో జమకావాల్సి ఉన్నప్పటికీ వివిధ కారణాలతో జమకాలేదు.

మరో జాబితా ఉందంటూ.. బుకాయింపు..

రుణమాఫీ కాకపోవడానికి గల కారణాలను రైతులకు తెలిపేందుకు ప్రభుత్వం ఏవో, ఏఈవోలకు ప్రత్యేక యాప్‌లను ఇచ్చింది. రైతుల ఆధార్‌కార్డు ఆధారంగా అధికారులు మాఫీ కాకపోవడానికి గల కారణాలను చెబుతున్నారు. అయితే సమస్య పరిష్కారానికి ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. తదుపరి ప్రభుత్వ ఆదేశాల మేరకు నడుచుకుంటామని రైతులకు సర్దిచెప్పి పంపిస్తున్నారు. గట్టిగా నిలదీస్తే.. మరో జాబితా వస్తుందని, అందులో మీ పేర్లు వచ్చే అవకాశం ఉందని బుకాయిస్తున్నారు. మరోపక్క.. జాబితాలో పేరు వచ్చి ఖాతాల్లో మాఫీ డబ్బులు జమకాకపోవడానికి అధికారులు అనేక కారణాలు చెబుతున్నారు. ఖాతాల్లో పేర్లకు, ఆధార్‌కు మధ్య తేడా కారణంగానే మాఫీ డబ్బులు జమకాలేదని పేర్కొంటున్నారు. కొంతమంది రైతుల ఖాతాలకు సంబంధించి ప్రీ ఆడిట్ నిర్వహణకు వ్యవసాయ శాఖ సిద్ధమవుతున్నది. ఆయా ఖాతాలకు సంబంధించిన రైతులు ఎంత మేరకు రుణాలు తీసుకున్నారు?. వడ్డీ ఎంత అయింది? ఎంత చెల్లించారు!. రెన్యువల్ ఖాతాలెన్ని? రెన్యువల్ తర్వాత బ్యాంకులేమైనా రుణాలిచ్చాయా? తదితర అంశాల వారీగా ప్రీ ఆడిట్‌ను నిర్వహించనున్నారు. ఇలా.. పరిశీలించే ఖాతాలకు ఆడిట్ పూర్తయ్యే వరకు నిధులు జమచేయడం లేదు. ఈ కారణంగానూ జాబితాలో పేరున్న రైతుల ఖాతాల్లో మాఫీ డబ్బులు జమకాలేదు. ఆగిపోయిన మాఫీ డబ్బులను తిరిగి ఖాతాల్లో ఎప్పుడు జమ చేస్తారని ప్రశ్నించిన రైతులకు అధికారుల నుంచి స్పష్టమైన సమాధానమే కరువైంది.

ప్రకటనలకే పరిమితమా?

పెండింగ్‌లోనే ప్రజా రవాణా వ్యవస్థల అనుసంధానం.. దృష్టి సారించని హెచ్ఎంఆర్ఎల్

సిటీబ్యూరో, జూలై 29 (నమస్తే తెలంగాణ):ప్రజా రవాణా వ్యవస్థల అనుసంధానం ప్రశ్నార్థకంగానే ఉన్నది. అత్యాధునిక ప్రజా రవాణా వ్యవస్థగా అందుబాటులోకి వచ్చిన మెట్రో రైలు కారిడార్లను ఆర్టీసీ బస్ స్టేషన్లు, రైల్వే, ఎంఎంటీఎస్ స్టేషన్లతో కలిపే ప్రక్రియ ప్రకటనలకే పరిమితమైంది. నగరంలో మెట్రో రైళ్ల రాకపోకలు ప్రారంభమై ఆరేండ్లు గడుస్తున్నా ఇప్పటికీ ప్రధాన రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లతో అనుసంధానం చేస్తామని చెప్పిన ప్రాజెక్టులను హైదరాబాద్ మెట్రో రైలు లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్) పూర్తిగా పక్కన పెట్టేసింది. అందుకు ప్రత్యేక నిదర్శనం... సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు తూర్పు వైపు కారిడార్-3 (నాగోల్-రాయదుర్గం)లో ఒక మెట్రో స్టేషన్ సికింద్రాబాద్ ఈస్ట్ ఉంటే, పడమర వైపు కారిడార్-2(జేబీఎస్- ఎంజీబీఎస్)లో సికింద్రాబాద్ వెస్ట్ మెట్రో స్టేషన్లు ఉన్నాయి. ఈ రెండు మెట్రో స్టేషన్లను సికింద్రాబాద్ ప్రధాన రైల్వే స్టేషన్‌తో కలిపే ఒక స్కై వాక్ నిర్మించాలని నిర్ణయించారు. దీనిపై పెద్ద ఎత్తున మెట్రో అధికారులు సర్వే చేసి, డిజైన్లు రూపొందించినా ఇప్పటికీ నిర్మాణం చేపట్టలేదు. రెండు మెట్రో కారిడార్ల నుంచి వచ్చే మెట్రో ప్రయాణికులు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లోపలికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు మార్గంలో నడుచుకుంటూ వెళ్తుంటే.. ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. ఇక స్టేషన్ దిగిన తర్వాత సామగ్రి ఎక్కువగా ఉంటే ఆటోలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఈ నేపథ్యంలోనే స్కైవాక్ నిర్మించి ఉంటే ఇలాంటి ఇబ్బందులు ఎదురయ్యేవి కాదని మెట్రో ప్రయాణికులు వాపోతున్నారు. ఇలా ఒక్క చోటే కాదు... మూడు మెట్రో కారిడార్‌లలో ఉండే నాంపల్లి (హైదరాబాద్) రైల్వే స్టేషన్, కాచిగూడ రైల్వే స్టేషన్లకు ప్రత్యేకంగా మెట్రో షటిల్ సర్వీసులు ఏర్పాటు చేస్తామని చెప్పినా.. ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదు.

నేటి నుంచి.. ఉదయం 5.30 గంటలకే మెట్రో

నగరంలో మెట్రో రైళ్ల రాకపోకలు మంగళవారం నుంచి ఉదయం 5.30 గంటల నుంచే మొదలుకానున్నాయి. మెట్రో రైళ్లలో ప్రయాణించే వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతుండటంతో ప్రస్తుతం ఉన్న సమయాలను పొడిగించాలని నగర వాసులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని మెట్రో రైళ్ల వేళలను పొడిగించాలని అధికారులు నిర్ణయించారు. ముఖ్యంగా సోమవారం నుంచి శుక్రవారం వరకు ఐటీ ఉద్యోగులు మెట్రోలోనే ఎక్కువగా ప్రయాణిస్తుండటంతో ప్రయోగాత్మకంగా శుక్రవారం ఉదయం 5.30 నుంచే మెట్రో రైలును నడిపారు. ఆ సమయంలో ప్రయాణికుల ఆదరణ ఉండడంతో ఇక నుంచి మూడు కారిడార్లలో టెర్మినల్ స్టేషన్ల నుంచి ప్రతి రోజూ ఉదయం 5.30 నుంచే సర్వీసులు నడుస్తాయని అధికారులు చెప్పారు.

పార్కింగ్ పాలసీ..

ఉల్లంఘిస్తే చర్యలే

అడ్డగోలు ఫీజు వసూలుపై జీహెచ్ఎంసీ ఫోకస్

మాల్స్, మల్టీప్లెక్స్, వాణిజ్య సంస్థల్లో స్పెషల్ డ్రైవ్

30 సర్కిళ్లకు 30 బృందాలను ఏర్పాటు చేసిన కమిషనర్

సిటీబ్యూరో, జూలై 29 (నమస్తే తెలంగాణ) : ఉచిత పార్కింగ్‌కు తిలోదకాలిచ్చే మాల్స్, మల్టీప్లెక్స్‌లు, వాణిజ్య సంస్థలపై కఠినంగా వ్యవహరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి నిర్ణయించారు. మొదటి 30 నిమిషాలు ఉచితంగా పార్కింగ్ , ఆ తర్వాత 30 నుంచి గంట వరకు షాపింగ్ చేసిన తర్వాత రసీదు చూపిస్తేనే ఫ్రీ పార్కింగ్ వెసులుబాటు.. ఉంటుంది. మూడు గంటలకు పైగా ఉంటే సంబంధిత మాల్ నిబంధనల ప్రకారం చార్జీలు వసూలు చేయాలి. ఇది ఉచిత పార్కింగ్ పాలసీ అమలు లక్ష్యం. కానీ చాలా చోట్ల మాల్స్, మల్టీప్లెక్స్‌లు వంటి వాణిజ్య సంస్థల్లో అడ్డగోలు పార్కింగ్ ఫీజులను వసూలు చేస్తున్నారు. ఈ తరహా ఫిర్యాదులు జీహెచ్ఎంసీకి ఇటీవల కాలంలో ఎక్కువగా వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే పకడ్బందీగా ఉచిత పార్కింగ్ పాలసీని అమలు చేసేందుకు సర్కిళ్ల వారీగా స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే 30 సర్కిళ్లలో 30 బృందాలను ఏర్పాటు చేశారు. ప్రత్యేక బృందాల్లో టౌన్‌ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్, రెవెన్యూ సెక్షన్ నుంచి ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్, ఈవీడీఎం నుంచి ఒకరు, ట్రాఫిక్ పోలీస్ నుంచి డీఎస్ఐ లేదా సీఐ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌తో ఐదుగురు సభ్యులను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు థియేటర్లు, మల్టీప్లెక్స్‌లో పర్యటించి.. వాటర్ స్టాగ్నేషన్, ఫుడ్ కోర్టుల్లో ఎలాంటి ఫుడ్ అందిస్తున్నారు. ఆ బిల్డింగ్‌కు ఫైర్ సేఫ్టీ పర్మిషన్ ఉందా? లేదా చెక్ చేయడంతో పాటు ఎన్ని గజాలకు అనుమతి తీసుకుని, ఎన్ని గజాలకు ట్యాక్స్ కడుతున్నారు? ఎంత ట్రేడ్ లైసెన్స్ కడుతున్నారు? అని పరిశీలించడమే కాకుండా ప్రతి మల్టీప్లెక్స్‌ల్లోనూ పార్కింగ్ చేసే చోట ఎంత పార్కింగ్ వసూలు చేస్తారు అని కూడా డిస్‌ప్లే చేసే విధంగా చర్యలు తీసుకోనున్నారు. నిబంధనలు పాటించకపోతే జరిమానా వేస్తామని కమిషనర్ స్పష్టం చేశారు.

జీహెచ్ఎంసీలో అంతర్గత బదిలీలు!

జీహెచ్ఎంసీలో భారీ ఎత్తున బదిలీలకు రంగం సిద్ధమైంది. ఒకే చోట నాలుగేండ్లకు పైబడి పనిచేస్తున్న అసిస్టెంట్ మొదలు, అడిషనల్ కమిషన్ల వరకు అన్ని విభాగాలకు సంబంధించి పెద్ద ఎత్తున బదిలీలు చేసేందుకు కసరత్తు పూర్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న బదిలీల్లో భాగంగా ఇప్పటికే టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్, ఎంటమాలజీ శాఖలకు సంబంధించిన ఉద్యోగులు జీహెచ్ఎంసీ నుంచి ఇతర మున్సిపాలిటీలకు వెళ్లడం, అక్కడి నుంచి బల్దియాకు రిపోర్టు చేసేవారు. ఒకటి, రెండు రోజుల్లో రాష్ట్ర క్యాడర్ బదిలీలు పూర్తి అయిన వెంటనే జీహెచ్ఎంసీలో అంతర్గతంగా ఉద్యోగులకు ఒకచోట నుంచి మరో చోటకు స్థాన చలనం కల్పిస్తారు. ఈ మేరకు కమిషనర్ ప్రత్యేక నివేదికను సిద్ధం చేశారు. వారం రోజుల వ్యవధిలో ఉద్యోగుల సమూల ప్రక్షాళన ఉంటుందని అధికార వర్గాలు తెలిపాయి. ప్రధానంగా అవినీతి ఆరోపణలు, సుదీర్ఘకాలం తిష్ట వేసినవారు బదిలీ కానున్నారు.

2500 మందికి పైగా బదిలీలు

జీహెచ్ఎంసీ పరిధిలో మొత్తం పర్మినెంట్, ఔట్‌సోర్సింగ్ లేదా కాంట్రాక్ట్ సిబ్బంది మొత్తం కలిపి 26 నుంచి 28వేల మంది ఉంటారు. 18వేల 5 వందల శానిటేషన్ వర్కర్లు, 950 సూపర్ వైజర్లు, 500 నుంచి 800 మంది ఆపరేటర్లు, 500 మంది జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, 400 మంది సూపరింటెండెంట్లు, సుమారు 100 మంది అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లు, 20 మంది జాయింట్ కమిషనర్లు, 20 మంది మెడికల్ ఆఫీసర్లు, 30 మంది డిప్యూటీ కమిషనర్లు ఉన్నారు. అయితే ఎక్కువగా బదిలీల్లో నాలుగేండ్లకు పైబడి ఒకే చోట కొనసాగుతుండడం, అవినీతి ఆరోపణలు, వివాదాస్పద అధికారులకు స్థాన చలనం ఉంటుంది.

మూసీ కాదు.. కాంగ్రెస్ ఏటీఎం

సోషల్ మీడియాలో కొనసాగుతున్న దుమారం.. సుందరీకరణ అంచనా వ్యయం పెంచడంపై ఆగ్రహం

సిటీబ్యూరో, జూలై 29(నమస్తే తెలంగాణ) : మూసీ సుందరీకరణపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వాన్ని అభాసుపాలు చేస్తున్నాయి. రూ. 50వేల కోట్లతో లండన్‌లోని థేమ్స్ తరహాలో అభివృద్ధి చేస్తామని చెప్పిన మూడు నెలల్లోనే రూ. లక్ష కోట్లు పెంచిన నయా అంచనా వ్యయం కాస్తా మూసీ పేరిట కాంగ్రెస్ చేసే నయవంచనగా మారుతుందంటూ విమర్శలు ఊపందుకున్నాయి. కాంగ్రెస్, సీఎం రేవంత్ రెడ్డి మూసీ బ్యూటిఫికేషన్ ప్రాజెక్టును ఏటీఎంగా మార్చుకునే ఆలోచనలు చేస్తున్నారని సోషల్ మీడియాలో నెటిజన్లు విరుచుకుపడుతున్నారు. ఇక సామాజికవేత్తలు, పర్యావరణ నిపుణులు, రాజకీయ పార్టీలు నేరుగా ఈ ప్రాజెక్టు విషయంలో కుట్రలు ఉన్నాయంటూ కుండలు బద్ధలు కొడుతున్నారు. 'సీఎం రేవంత్‌కు చిత్తశుద్ధి ఉంటే.. నగర జీవన ప్రమాణాలను పెంచేలా విద్య, రవాణా, ఆరోగ్య సేవలను మెరుగుపరచాలి. అంతేగానీ గుడ్డెద్దు పోయి చేనులో పడినట్లుగా కార్యాచరణ లేకుండా మూసీ అంచనాలు పెంచడం వెనుక పెద్ద కుట్రనే సాగుతున్నది. ' అంటూ సీనియర్ జర్నలిస్ట్ విఠల్ కుండబద్ధలు కొడితే.. 'మూసీ సుందరీకరణ కాదు.. మురికివాడల్లో ఉంటున్న ప్రజలకు మౌలిక వసతులను అభివృద్ధి చేసే దమ్ము ఉందా' అంటూ సీనియర్ న్యాయ నిపుణులు ప్రొ. గాలి వినోద్ కుమార్ సవాల్ విసిరారు. ఇలా మూసీ సుందరీకరణ నయా అంచనాల పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న నయవంచనపై జనాలు గొంతెత్తుతూనే ఉన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మూసీ విషయంలో చిత్తశుద్ధిని ప్రదర్శిస్తూ... ప్రజాధనంపై ఉన్న దాహాన్ని తగ్గించుకోవాలంటూ వ్యాఖ్యలు చేస్తుంటే.. బీజేపీ నేరుగా రేవంత్ రెడ్డి లక్ష్యంగా ఆరోపణలు చేస్తున్నది. కాగా, సీనియర్ జర్నలిస్టులు పాశం యాదగిరి, విఠల్, సీనియర్ న్యాయ నిపుణులు ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ వంటి సామాజిక బాధ్యత కలిగిన మేధావులు రేవంత్ తీరును ప్రశ్నించారు. ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డి మూసీపై చూపుతున్న చొరవను ఎత్తిచూపుతున్నారు. ప్రభుత్వం చెబుతున్న మాటలన్నీ లూటీ చేసే కుట్రలేనని వ్యాఖ్యానిస్తున్నారు. అంతగా కావాలంటే నగరంలో పడకేసిన రవాణా, విద్య, వైద్య సేవలను మెరుగుపరచాలని డిమాండ్ చేస్తున్నారు. ఇక మూసీ సుందరీకరణ ప్రాజెక్టును వచ్చే ఐదేండ్ల పాటు కాంగ్రెస్ పార్టీ ఏటీఎంలా మార్చుకునేలా ఉందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ కుట్రలను బట్టబయలు చేసేలా బీఆర్ఎస్ లెక్కలతో తేల్చి పడేసింది.

• ట్రాఫిక్ మార్షల్స్

సిటీబ్యూరో, జూలై 29 (నమస్తే తెలంగాణ): రోజురోజుకూ పెరిగిపోతున్న ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు సైబరాబాద్ పోలీసులు దేశంలోనే తొలిసారిగా ట్రాఫిక్ మార్షల్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరించడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులకు సహకరించేందుకు కొత్తగా ట్రాఫిక్ మార్షల్స్‌ను రంగంలోకి దింపారు. ఐటీ కంపెనీల సహకారంతో ఎంపిక చేసిన వారికి ట్రాఫిక్ నియమాలు, చట్టాలపై పూర్తిస్థాయి అవగాహన, ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం 83 మంది ట్రాఫిక్ మార్షల్స్ రంగంలోకి దిగారు. ఈ నెల 12న విధుల్లోకి చేరిన ట్రాఫిక్ మార్షల్స్ ప్రధానంగా ఐటీ కారిడార్‌లోని బాటిల్‌నెక్, అత్యంత రద్దీగా ఉండే జంక్షన్ల వద్ద విధులు నిర్వర్తిస్తున్నారు. ఉదయం 8 నుంచి 11.30గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి రాత్రి 9.30వరకు వీరు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం పనిచేస్తున్నారు. వివిధ ఐటీ కంపెనీల సహకారంతో ట్రాఫిక్ మార్షల్స్‌కు గౌరవ వేతనం అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు.